ప్రజాశక్తి

మంగళవారం 2 డిసెంబర్ 2025

అభివృద్ధి, సంక్షేమ పాలన

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అనంతపురం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అభివద్ధి, సంక్షేమం రెండింటికీ సమప్రాధన్యత ఇస్తూ పాలన సాగిస్తోందని రాష్ట్ర ఆర్థిక, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలియజేశారు. సోమవారం ఆయన ఉరవకొండ మండలం బూదగవి గ్రామంలో పర్యటించారు. ముందుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఆర్ఎంఎస్ఎ కింద రూ.43.75 లక్షల అంచనాతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. బూదిగవి గ్రామ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి చేత పుస్తకంలో పాఠాలు చదివించారు. అనంతరం ఉరవకొండ పట్టణంలోని మంత్రి కార్యాలయంలో "ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు, నాయకుల నుంచి మంత్రి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టుల మీద, ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివద్ధి చేయడం మీద ముఖ్యమంత్రి దృష్టి సారించారన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా రాయలసీమలో ప్రాజెక్టులను మళ్లీ పరుగులు పెట్టించే దిశగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాయలసీమ ప్రాజెక్టులలో ఒక గంపమన్ను తవ్వలేదని విమర్శించారు. గత ప్రభుత్వానికి భిన్నంగా రాయలసీమలో ప్రాజెక్టులను మళ్లీ పరుగులు పెట్టించే దిశగా ముందుకెళ్తున్నామన్నారు. ఇప్పటికే హంద్రీనీవా వెడల్పును ఒక దశ పూర్తి చేసామని, ఇందులో రెండవ దశ లైనింగ్ అంతా పూర్తయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి శైలజ, తహశీల్దార్ మహబూబ్ బాషా, ఎంపిడిఒ రవిప్రసాద్, డీఈ రమణారెడ్డి, ఆయా శాఖల అధికారులు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారురాలి ఇంటి వద్దనే పింఛన్ సొమ్మును అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పెద్దవడుగూరు ప్రాంతంలో వివిధ రకాల ఖనిజ సంబంధిత గనులు ఉన్నాయి. వీటిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. చాలా కాలంగా ఖనిజ సంపదను నిబంధనలకు విరుద్ధంగా కొల్లగొడుతున్నారు. విలువైన ఖనిజ సంపద భూగర్భంలో ఉన్నందుకు ఎకరం భూమి అరకోటి రూపాయల పైమాటే ఇక్కడ ధర పలుకుతోంది.

తవ్వకాల 'గనులు'

- అనుమతులు లేకుండా ఖనిజం తవ్వకాలు
- గనుల యజమానుల స్వార్థానికి అటవీ సంపద లూటీ
- రహదారులను సైతం తవ్వేస్తున్న వైనం
- పర్యావరణ శాఖ అనుమతులు నిల్

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పెద్దవడుగూరు మండలం కొండుపల్లి, క్రిష్టిపాడు గ్రామాల్లోని భూగర్భగనుల్లో స్టీటైట్, డోలమైట్, సున్నపురాయి విరివిగా లభిస్తోంది. ఈ గ్రామాల్లో గనుల తవ్వకానికి కొందరికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. అనుమతులున్న వారే కాకుండా చాలా మంది అక్రమంగా త్వకాలు చేస్తున్నారు. రాజకీయ పలుకుబడి కలిగిన పెద్దలు అనుమతులు లేకపోయినా భూగర్భ గనుల్లో యథేచ్ఛగా తవ్వకాలు చేస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో అక్కడి ప్రభుత్వం ఖనిజ తవ్వకాలకు ఇటీవల అనుమతులు ఇవ్వడం లేదు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఖనిజ నిక్షేపాలకు డిమాండ్ పెరిగింది. రోజుకు వేల టన్నులకొద్ది ఖనిజం అక్రమంగా లారీల్లో తరలిపోతున్నా అటవీశాఖ, రెవెన్యూ, గనులశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఇక్కడి భూగర్భగనుల్లో లభించే స్టీటైట్, డోలమైట్, సున్నపురాయి గనులు ఉండగా ఇందులో స్టీటైట్ రాయికి దేశవ్యాప్తంగా ఎంతో గిరాకి ఉంది. ఈరాయి ఖరీదుతో కూడుకున్నది కావడంతో తవ్వకాలు జరిపి తరలించేందుకు రాజకీయ అండదండలున్న కొందరు పోటీపడుతున్నారు.

అటవీభూములనీ వదలని వైనం

కొండుపల్లి సమీపంలో అటవీశాఖకు సంబంధించిన భూములు వందల ఎకరాలు ఉన్నాయి. వీటిలో తూర్పువైపున సర్వేనెంబర్ 302-ఎలో 267.69 ఎకరాలు ఉంది. పడమర వైపున 1007 సర్వేనెంబర్‌లో 715లో 30 ఎకరాల భూములతో పాటు కొండలు ఉన్నాయి. ఈ భూభాగంలో కొండలను వదిలిపెట్టి మైదాన భూముల్లో విలువైన ఖనిజాన్ని అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. తమ గనుల పక్కనే ఉన్న అటవీభూములను ఆక్రమించి యథేచ్ఛగా తవ్వకాలు జరిపి అక్రమంగా ఖనిజ సంపదను దోచుకుంటున్నారు. అటవీభూములనే కాకుండా రోడ్లను, ప్రభుత్వ బీడు నేలలను, వంక పోరంబోకు భూములను కూడా వీరు వదల్లేదు. గ్రామాలకు వెళ్లే రహదారుల కిందిభాగంలో తవ్వకాలు జరుపుతున్నారు. రోడ్డుకింది భాగంలో తవ్వకాలు జరపడం వల్ల అటుఇటుగా వెళ్లే భారీ వాహనాలతో ఎప్పుడు కుంగిపోతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కొన్నింటికే అనుమతులు

కొండుపల్లి, క్రిష్టిపాడు ప్రాంతాల్లో ఉంటున్న భూగర్భగనుల్లో కొన్ని గనులకు మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువ గనులు ఎలాంటి అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూములను ఆక్రమించి తవ్వకాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో తవ్వకాలు జరుపుతున్న గనులు 36 కాగా ఇందులో 19 గనులకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల కొన్ని గనులపై సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా దాడులు జరిపారు. అనుమతులు లేని వాటిపై మాత్రం చర్యలు తీసుకున్న దాఖాలాలు నామమాత్రమే. ఇతరుల రాయల్టీ రుసుం పేరుతో ఇక్కడి గనుల యజమానులు ఉపయోగిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుంకు ఎగనామం పెడుతున్నారు. ఇక గనుల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతను కూడా యాజమాన్యలు పట్టించుకోవడం లేదు. ఈ గనుల్లో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మరణించడం, వికలాంగులుగా మారడం పరిపాటిగా మారింది.

సున్నపురాయి కోసం జరిగిన తవ్వకాలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కొండుపల్లి ప్రాంతంలో ఉంటున్న అటవీభూముల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదు. అటవీశాఖ పరిధిలోకి ఏఏ సర్వేనెంబర్లు వస్తాయో తెలుసుకుని పరిశీలించి, తవ్వకాలు జరిపిన వ్యక్తులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. అక్రమ త్వకాలు జరిపినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం.

నారపరెడ్డి, అటవీశాఖ సెక్షన్ అధికారి, గుత్తి.

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన

డిఎంహెచ్ఒ డా॥ఈబి దేవి - అనంతలో అవగాహన ర్యాలీ

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఒ ఈబీ.దేవి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండడంతో ద్వారానే దానిని నిర్మూలించవచ్చుని డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి తెలియజేశారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో సోమవారం నాడు చేపట్టిన అవగాహన ర్యాలీని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎన్.రాజశేఖర్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆర్ట్స్ కాలేజ్ నుంచి ప్రారంభం అయిన ర్యాలీ సప్తగిరి సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ అవగాహనతో ముందుకు రావాలన్నారు. జిల్లా లెప్రసి, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డా॥జయలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కాలేజీలు, స్కూళ్ళలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ ర్యాలీలో అనంతపురం సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డా॥సుబ్రమణ్యం, డిప్యూటీ ఆర్ఎంఒ డా॥ హేమలత, డెమో నాగరాజు, హెచ్ఇఒ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈవో గంగాధర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకట రత్నం, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సాయంత్రం క్యాండిల్ లైట్ విజిల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ మరియు క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ జయలక్ష్మి తదితరులు ఇందులో పాల్గొన్నారు. హెచ్ఐవితో జీవిస్తున్న వారితో కలసి అధికారులు సహపంక్తి భోజనం చేశారు

నేడు బిటిపి ఆయకట్టు రైతుల సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

భైరవాణి తిప్ప ప్రాజెక్టు(బిటిపి) విశ్రాంతి భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు బిటిపి ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహిస్తున్నట్లు జల వనరుల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.గీతాలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ఆయకట్టు రైతులు పాల్గొని రిజర్వాయర్ నుంచి కాలువలకు నీటి విడుదల తేదీపై నిర్ణయం తీసుకునేందుకు సహకరించాలని కోరారు. నదీ పరివాహక ప్రాంతం, కర్నాటకలో విస్తృతంగా వర్షాలు కురవడం వల్ల అక్టోబర్‌లోనే రిజర్వాయర్‌లో నీటి మట్టం పూర్తిస్థాయిలో చేరిందన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2 టిఎంసిల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. నిల్వను బట్టి వంతుల వారీగా కుడి, ఎడమ కాలువ ఆయకట్టుకు నీరు విడుదల తేదీలను సమావేశంలో నిర్ణయిస్తామన్నారు. కావున ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ ఆయకట్టు రైతులు సమావేశానికి హాజరుకావాలని డీఈఈ కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణానికి సోమవారం తహశీల్దార్ మునివేలు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ శ్రీనివాస్‌నాయక్ భూమిపూజ చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి బొమ్మనహాల్‌కు వచ్చే ప్రజలు మరుగుదొడ్ల కోసం చాలా ఇబ్బందులు పడేవారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా రూ. 20 లక్షలు మంజూరు చేశారన్నారు. ఇక్కడ మహిళలు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు సీజ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

పట్టణంలోని శ్రీచైతన్య ఎరువుల దుకాణాన్ని సోమవారం వ్యవసాయశాఖ ఎడి యల్లప్ప, ఏవో శ్రావణ్ తనిఖీ చేశారు. ఎరువుల వివరాలు, రికార్డుల నిర్వహణ సరిగా లేవని గుర్తించి రూ. 2.16 లక్షల విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

బద్దేనాయక్ చొరవ... పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం..

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శెట్టూరు మండలంలోని చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా తాగునీటి సమస్య నెలకొంది. స్పందించిన ఉపాధ్యాయుడు, ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ చొరవ చూపి సొంత ఖర్చులతో సోమవారం పాఠశాలలో బోరు వేయించగా నీరు సమృద్ధిగా పడ్డాయని హెచ్ఎం సుజాత తెలిపారు. మాస్టారు బద్దే నాయక్ మాట్లాడుతూ విద్యార్థుల ఇబ్బందులను గమనించి తాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారం చూపామని తెలిపారు. బద్దేనాయక్ చొరవ పట్ల విద్యాశాఖ అధికారులు శ్రీధర్, వాణిదేవి, కాంప్లెక్స్ ఛైర్మన్ భాస్కర్, సర్పంచి, హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు చాపిరి తిప్పేస్వామి, రవి, ఈశ్వరమ్మ, శ్రీలక్ష్మి, గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

బోరు వేయిస్తున్న బద్దేనాయక్

పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

కలెక్టర్‌కు రైతు సంఘం వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులు పండించిన మొక్కజొన్న, వరి, పత్తి పంటకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిహెచ్.రాయుడు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రయివేట్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గిస్తున్నారని, దీంతో పంటలకు గిట్టుబాటు ధరలులేక రైతులు నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర రావాలంటే వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరారు. జిల్లాలో మొక్కజొన్న 42 వేల హెక్టార్‌లలో సాగు చేశారని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2400 కాగా ప్రయివేటు వ్యాపారులు రూ.1800కు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. పత్తి 29 వేల హెక్టార్లలో సాగు చేశారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8110 కాగా ప్రయివేట్ వ్యాపారులు రూ.6 వేల నుంచి రూ.6500కు మించి కొనడం లేదన్నారు. వరి 32 వేల హెక్టార్లలో సాగు చేయగా ప్రస్తుతం పంట కోతలు ప్రారంభించారని తెలిపారు. అప్పులు చేసి రైతులు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తే కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా రాకపోవడంతో పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. అరటి సాగుచేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం మొక్కజొన్న, వరి, పత్తి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు వెంటనే ప్రారంభించి రైతు సేవ కేంద్రాల ద్వారా కొనుగోలు ప్రారంభించి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సంజీవరెడ్డి, రైతులు శ్రీనాథ్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

రెవెన్యూ సమస్యలపై ఆర్డీవోకు వినతి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

బెళుగుప్ప మండలం కోనంపల్లి గ్రామంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ గ్రామ రైతులు సోమవారం ఆర్డీవో వసంతబాబుకు విన్నవించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో బాధిత రైతులు శ్రీరాములు, ఎర్రిస్వామి, గోవర్ధన్, హనుమంతప్ప, వెంకరటణతో పాటు 15 మంది రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. అలాగే సర్పంచులు రామాంజనేయులు, ఎర్రిస్వామి, వైసిపి నాయకుడు వీరన్న, తదితరులు రైతులకు ఎదురవుతున్న సమస్యలను వివరించారు. సర్వే నెంబర్-106లో 16 మంది రైతులు ఉన్నారన్నారు. ఓ రైతు సమస్య కారణంగా అందులోని విస్తీర్ణం మొత్తం జాయింట్‌గా భావించి డిస్ప్యుట్‌లో పెట్టారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందరి రైతుల ఆధారాలను పరిశీలించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

రాయదుర్గం రూరల్ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం ఎంపిపి విద్యావతి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. సర్పంచులు, ఎంపిటిసిలు అలా వచ్చి ఇలా వెళ్లారు. గ్రామపంచాయతీలకు కేటాయించిన నిధుల వివరాలు తెలపాలని వైస్ ఎంపిపి అరుణ్‌కుమార్ ఎంపిడిఒ కొండన్నను ప్రశ్నించారు. ఇది అజెండాలో లేని విషయం అని, ఎంపిపిని అడగాలని ఎంపిడిఒ సమాధానం ఇచ్చారు. దీంతో సమావేశం నుంచి బయటకు వచ్చిన సభ్యులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

హత్యాయత్నానికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

గుమ్మఘట్ట మండలం ఆర్.కొత్తపల్లి గ్రామంలో దళిత రాకేష్‌పై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ జెఎసి తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప, రాయదుర్గం మండల అధ్యక్షుడు కిష్టప్ప సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. పాలకుల మెప్పు కోసం డీఎస్పీ రవిబాబు ఈ కేసులో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత దళితులపై కౌంటర్ కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. ఆరబెట్టిన మొక్కజొన్న పంటను పెత్తందార్లు ట్రాక్టర్‌తో తొక్కించడమే కాకుండా, ప్రశ్నించిన రాకేష్‌పై హత్యాయత్నానికి పాల్పడడం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు కేసు నమోదు చేయలేదని వాపోయారు. ఈ సమస్యపై త్వరలోనే పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

అర్జీలకు వేగవంతంగా పరిష్కారం : కలెక్టర్

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు వాటికి పరిష్కారం చూపాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మతో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులతో కలిసి 437 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'నేను సైతం' పోస్టర్లు ఆవిష్కరణ

మహిళలపై హింస వ్యతిరేక అంతర్జాతీయ పక్షోత్సవాల నేపథ్యంలో మహిళలు, బాలికలపై జరిగే హింసను ఆపడానికి నేనుసైతం అని సమాజంలోని అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేసేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టర్లు సోమవారం స్థానిక కలెక్టరేట్లో విడుదల చేశారు. కలెక్టర్ ఓ.ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డిఆర్ఒ మలోల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాజీ ఎంపీపై ఆరోపణలు తగదు

ప్రజాశక్తి-కుందుర్పి

మాజీ ఎంపీ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్యపై టిడిపి నేత వైపి.రమేష్ అసత్య ఆరోపణలు చేయడం తగదని వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి పేర్కొన్నారు. కుందుర్పిలో వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు నివాసంలో సోమవారం విలేకరుల సమా వేశం నిర్వహించారు. పాలాక్షి మాట్లాడుతూ యానకల్లు గ్రామంలో బోయ ఆనంద్ హత్యను ఆత్మ హత్యగా చిత్రీకరించింది మీరు కాదా అని ప్రశ్నించారు. అమాయకుల జీవితాలతో చెలగాటం ఆడుతు న్నది, శవ, చిల్లర రాజకీయాలు చేస్తుంది టిడిపి నాయకులే అన్నారు. తెలుగుతమ్ముళ్లు ధనార్జనే ధ్యే యంగా నియోజకవర్గంలో కుంభకోణాలు, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారన్నారని ఆరోపించా రు. ఇకపై తలారి రంగయ్యపై అసత్య ఆరోపణలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ కె.హనుమంతరాయుడు, తాలూకా మహిళా అధ్యక్షురాలు నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు మఠం భీమప్ప, బసాపురం సర్పంచి బొమ్మయ్య, నాయకులు రోడ్డయ్య, ఈరన్న, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకుడు పాలాక్షి

వికలాంగుల హక్కుల చట్టం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం కలెక్టరేట్ రెవెన్యూ భవనంలో సోమవారం నాడు విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల చట్టం-2016 తెలుగు అనువాద పుస్తకాన్ని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులను రక్షించడం, ప్రోత్సహించడం లక్ష్యంగా వారికి అర్థమయ్యేలా రూపొందించిన వికలాంగుల హక్కుల చట్టం- 2016 తెలుగు అనువాద పుస్తకం దివ్యాంగులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, ఆనంద్, తిప్పేనాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ అనిల్, విజువల్లి ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జలంధర్ రెడ్డి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రతాప్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజల దాహం తీర్చడమే లక్ష్యం : సర్పంచి

ప్రజాశక్తి-కుందుర్పి

గ్రామంలోని ప్రజల దాహం తీర్చడమే లక్ష్యమని సర్పంచి మారుతీశ్వరి రామ్మూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న ఒక బోరులో నీరు రావడం లేదన్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్రాక్టర్ ద్వారా సరఫరా చేస్తామన్నారు. జియాలజిస్ట్ చేత పాయింట్ చూపించి కొత్త బోరు వేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

అంబేద్కర్ సర్కిల్ బోర్డు తొలగింపు అన్యాయం

నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న అంబేద్కర్ సర్కిల్ బోర్డును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పలు దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ నాయకులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ జిల్లాకేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో కుల వివక్షత ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. అంబేద్కర్ బోర్డు తొలగించడం దళిత సమాజంతోపాటు అంబేద్కర్‌ని అవమానించినట్లే అన్నారు. కావున వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా వెంటనే సంబంధిత బోర్డును యథాస్థానంలో ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో దళిత, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.కుళ్లాయప్ప, రైతుసంఘం నాయకులు శివారెడ్డి, సంజీవరెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు చిన్న ఆంజనేయులు, బికెఎస్ ఆనంద్, బండారు చంద్ర, వ్యవసాయక కార్మిక సంఘం నాయకులు నాగలింగ, వెంకటేశులు, నార్పల పుల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు స్థలాలు, ఇళ్లు ఇవ్వాలి

సిఐటియు ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

హమాలీ, ఆటో, పంచాయతీ కార్మికులకు స్థలాలు, ఇల్లు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. కార్మికులకు స్థలాలు, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ డ్రైయినేజీలను శుభ్రం చేసే పంచాయతీ కార్మికులు, పెద్ద పెద్ద మూటలు మోసే హమాలీలు, ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగించే కార్మికులకు సొంతిళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే అరకొర డబ్బులు ఇళ్ల బాడుగలు కట్టుకునేందుకే సరిపోవడం లేదన్నారు. కావున వెంటనే ప్రభుత్వం స్పందించి కార్మికులకు స్థలాలు, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీ కార్మికులకు నెలనెలా వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పండ్లతోటల రైతు సంఘం జిల్లా నాయకులు వి.శివారెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు ఆర్.కుళ్లాయప్ప, జిల్లా నాయకులు శివప్రసాద్, సిఐటియు మండల కార్యదర్శి సి.నాగేంద్ర, ఆటో యూనియన్ నాయకులు రాఘవరెడ్డి, చిరంజీవి, కొండా, పోతలయ్య, వ్యకాసం నాయకులు పుల్లయ్య, రైతుసంఘం జిల్లా నాయకులు సంజీవరెడ్డి, గ్రామ పంచాయతీ యూనియన్ మండల నాయకులు సుబ్రమణ్యం, ఎర్రినాగప్ప, నాగరాజు, మహిళా పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో రెండుపూటల పని విధానాన్ని రద్దు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రెండుపూటల పని విధానాన్ని రద్దు వెంటనే చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ ఉపాధి హామీ చట్టం పేదలకు ఒక వరం అన్నారు. అలాంటి చట్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు కొట్టే విధంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. కావున ఉపాధి పథకం చట్టం కింద సంవత్సరంలో 200 రోజులు పని దినాలు కల్పిస్తూ రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే హార్టికల్చర్ పథకం కింద చెట్లు నాటుకున్న రైతులకు వెంటనే బిల్లులను మంజూరు చేయాలన్నారు. పనులు చేసిన వెంటనే కూలీల ఖాతాలకు నగదు జమ చేయాలన్నారు. రాచేపల్లి లిడ్‌క్యాప్ చెప్పుల పరిశ్రమను ఓపెన్ చేసి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సూర్యప్రకాష్, లక్ష్మీపతి, వెంకటాచలం, వెంకటస్వామి, సుంకన్న, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలి

నిరసన తెలుపుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

కౌలు రైతులందరికీ ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు రుణాలు ఇవ్వాలని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండ మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు వద్ద కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసిఆర్‌సి కార్డు ఉన్న కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలన్నారు. ఆర్‌బిఐ నిబంధన మేరకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వాలని నిబంధన ఉన్నా బ్యాంకు అధికారులు ముందుకు రావడం లేదని వాపోయారు. వెంటనే కౌలు రైతులకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శి వెంకటేసులు, సురేష్, కౌలు రైతు నాయకులు సుంకన్న, జి.సీనప్ప, రామాంజనేయులు, ఆంజనేయులు, నాగవేణి, తిప్పమ్మ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి

జిల్లాలోని కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య స్థానిక కౌలురైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

'పది' మోడల్ పరీక్ష పత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదవ తరగతి పరీక్ష పత్రాలను ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం ఉరవకొండలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్ప చౌదరి, జిల్లా కార్యదర్శులు శేఖర్, సంజీవ్‌కుమార్, రాజశేఖర్, ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండలాల బాధ్యులు శ్రీనివాసులు, ఉమాపతి, రఘు, లక్ష్మీనారాయణ, ప్రసన్నకుమార్, బండయ్య, నాగరాజు, జయరాములు, శ్రీనివాస్, గుప్త, చంద్రమోహన్, వేణు, శ్రీధర్, మోహన్, శివ, సంతోష్, మధుబాబు, మైలార్ లింగ, శ్రీనివాసులు, ఇస్లాం బాషా, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్ష

యాడికి : మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలోని టిడిపి కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గుంతకల్లు సింగిల్‌విండో ప్రెసిడెంట్ తలారి మస్తానప్ప వివిధ అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, సీనియర్ నాయకులు రుద్రమనాయుడు, తెలుగు యువత నాయకుడు తాంద్ర విక్రమ్, రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వి.ఆదినారాయణ, మాయకుంట్ల నారాయణస్వామి సెల్ పాయింట్ చాంద్‌బాషా, హాజీ మస్తాన్, సుభాన్ మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

పామిడి : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ పట్టణంలోని 9వ వార్డులో వైసిపి నాయకులు సంతకాలు సేకరణ చేపట్టారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు అనుంపల్లి సూరి, మద్దికేర బాషా, పెద్దకాలువ వినోద్, పిక్కిలి రంగనాయకులు, పిక్కిలి రామాంజి, బెస్త వెంకటరాముడు, చిరంజీవి, పిక్కిలి రాజా, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

ANANTHAPURAMU MUNICIPAL CORPORATION
e-PROCUREMENT- TENDER NOTICE

1	Tender Notice No.	289 to 302/General Funds/2025-26/TO
2	Scope of Work	Providing of CC Roads and Paver blocks and Cental Lighting and providing Tractors with Trilors on hire basis in various places in the town
3	No of Works	14 Nos
4	Estimate Cost	Rs. 2.00 to 27.00 Lakhs

Note: The details of tender may be seen on e-procurement market Place avalible @https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner
Municipal Corporation
Ananthapuramu

సమాజాన్ని చైతన్యపరిచిన 'గురజాడ'

జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమాజంలో పేరుకుపోయిన కుల, మత, మూఢనమ్మకాల చాందసవాదాలను నిర్మూలించకపోతే భావితరాలకు భవిష్యత్తు ఉండదని సమాజాన్ని హెచ్చరించి చైతన్యపరిచిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి కొనియాడారు. గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం జెవివి నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు గురజాడ లాంటి ఎందరో మహానుభావులు దేశంలో పేరుకుపోయిన మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయకపోతే ఈరోజు పరిస్థితులు ఇలా ఉండేవి కావన్నారు. సమాజం చైతన్యవంతం కావాలంటే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని.. అప్పుడే గురజాడకు అర్పించే ఘన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ పి.ప్రసూన, జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, అధ్యాపకులు అంకే శ్రీనివాస్, హేమమాలిని, జెవివి నాయకులు ప్రసాద్ రెడ్డి, తిరుపాల్, రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, మన్సూర్, మున్నా, రాజేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

అరటి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్-వైసిపి ఆధ్వర్యంలో అరటి గెలలతో నిరసన

అరటి గెలలతో ర్యాలీగా వస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులు పండించిన అరటి పంటను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. అరటి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో అరటి రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా అరటి గెలలు భూజాన మోసుకొస్తూ కలెక్టరేట్ గేటు ఎదుట రోడ్డుపై పడేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అరటి రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధరల లేకపోవడంతో గొర్రెలకు వదిలేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలన్నారు. వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో గతంలో ప్రవేశపెట్టిన రైతు ధరల స్థిరీకరణ నిధిని తక్షణమే పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం స్పందించి అరటి పంటను కిలో రూ.10తో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు సంఘం రాష్ట్ర ప్రతినిధి సత్యనారాయణరెడ్డి, రైతు విభాగం జిల్లా నాయకులు, గోకుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, యల్లనూరు జెడ్పీటీసీ బోగాతి ప్రతాప్‌రెడ్డి, శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల వైసిపి కన్వీనర్లు పూల ప్రసాద్, యల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఖాదర్‌బాషా, మహేశ్వరరెడ్డి, శివశంకర్, చామలూరు రాజగోపాల్, శివశంకర్ నాయక్, సాకే చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు కార్యాచరణ

మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని

విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని అన్నివార్డుల్లో అధ్వాన్నంగా ఉన్న పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు కార్యాచరణ రూపొందించుకున్నామని మున్సిపల్ ఛైర్‌పర్సన్ నంగినేని భవాని తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శానిటేషన్ మెరుగుపై తీసుకున్న కార్యాచరణను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1980-85లో లక్ష జనాభాకు మున్సిపాలిటీలో 146 మంది పారిశుధ్య కార్మికులు ఉండేవారన్నారు. పట్టణ వైశాల్యం, మురికి కాలువలు తక్కువగా ఉండేదన్నారు. అయితే 2025 నాటికి 1.60 లక్షల జనాభాతో 37 వార్డులుగా విస్తరించిందన్నారు. ఈమేరకు పట్టణ పారిశుధ్య నిర్వహణకు 300 మంది కార్మికులు అవసరం ఉండగా ఆప్కాస్ కార్మికులతో కలిసి కేవలం 232 మంది కార్మికులు మాత్రమే ఉన్నారన్నారు. నాలుగు డివిజన్లకు ఒక సానిటరీ ఇన్స్‌పెక్టర్ మాత్రమే ఉన్నారన్నారు. సచివాలయ శానిటరీ కార్యదర్శులను నలుగురిని శానిటేషన్ పనులకు బాధ్యతలు అప్పగించామన్నారు. రేపటి నుంచి రాత్రి సమయంలో పారిశుధ్య నిర్వహణకు శ్రీకారం చుట్టామన్నారు. ఇకపై రోడ్ల పక్కన చెత్తకుప్పలు లేకుండా రాత్రికి రాత్రి వాటిని కంపోస్టుకు తరలిస్తామన్నారు. ఆవులు, కుక్కల యజమానులను పిలిపించి వాటిని సంరక్షించుకోవాలని సూచించామన్నారు. అయితే ఇప్పటి వరకు వారు స్పందించలేదని ఇకపై ఆవులు రోడ్లపై కనిపిస్తే గోశాలలకు తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్, అసిస్టెంట్ కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నంగినేని రామలింగప్ప, సచివాలయాల శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

యల్లనూరు : మండల పరిధిలోని వెంకటాద్రిపల్లి గ్రామంలో సోమవారం వైద్యాధికారి లోకేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సుమారు 50మందికి బిపి, షుగర్, అస్తమా, దగ్గు, జలుబు, తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని నరసాపురం గ్రామంలో మంత్రి పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో సోమవారం అనంతపురం మ్యాగ్నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు ఇందులో భాగంగా వైద్యులు ప్రజలకు వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నరసాపురం ప్రసాద్, వైద్యులు రితికేష్, లిఖిత, రిషి, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా వారోత్సవాలు

ప్రజాశక్తి-రాప్తాడు

మండలం పరిధిలోని గంగులకుంట, ప్రసన్నాయపల్లి రైతు సేవాకేంద్రాల పరిధిలో మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సోమవారం పంటల బీమా వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగగా పంటల బీమా కట్టుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బెలుగుప్ప

విశ్వ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన జోనల్ లెవెల్‌లో వేదిక్ వాస్తు, అబాకస్ పోటీల్లో మండల కేంద్రంలోని శ్రీనివాస్ విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి.సంతోష్ (ఫస్ట్ క్లాస్) స్టేట్ ఫస్ట్ ర్యాంకు ఛాంపియన్‌షిప్, కె.ఆదిత్య చంద్రారెడ్డి సెకండ్ ర్యాంక్, బి.జ్ఞానేశ్వర సెకండ్ క్లాస్ రిషింగ్ స్టార్, థర్డ్ ర్యాంక్ అవార్డులను సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ శ్రీనివాసులు తెలిపారు. ఈమేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు సుమ, అధ్యాపకులు అభినందించారు.

'పెంచలయ్య' హంతకులను శిక్షించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

నెల్లూరు జిల్లాలోని ఆర్డీటీ కాలనీలో సిపిఎం నేత పెంచలయ్యను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేసిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విచ్చలవిడి గంజాయి, మద్యం బెల్ట్‌షాపుల వల్ల శాంతి భద్రతలకు తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. నెల్లూరు రూరల్ మండల పరిధిలో పెద్దఎత్తున గంజాయి మాఫియా ఆరాచకాలపై కలిగే అనర్థాలను విద్యార్థులకు తనపాటల ద్వారా ప్రచారం చేస్తున్న సిపిఎం ప్రజానాట్యమండలి నాయకులు పెంచలయ్యను గంజాయి ముఠా అత్యంత కిరాతకంగా హత్య చేసిందన్నారు. గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చెబుతున్న మాటలు పేపర్లకే పరిమితం అయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచలయ్యను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పెంచలయ్య కుటుంబ సభ్యులకు రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించి, భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు రమేష్, నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు చంద్ర, రామునాయక్, అబ్దుల్లా, షాషా, ఎస్ఎఫ్ఐ నాయకులు గిరి, వెంకి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన అవసరం

గుత్తి : ఫ్లోరోసిస్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి, వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ఫ్లోరోసిస్ జిల్లా మేనేజర్ జి.ఆంజనేయులు సూచించారు. సోమవారం మండలంలోని వన్నెదొడ్డి గ్రామంలో ఫ్లోరోసిస్, క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఫ్లోరోసిస్ బాధితులకు చేతికర్రలు, వాకర్స్, నడుము, మెడ బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, కిషోర్, సిహెచ్‌ఓ లు, హెల్త్ సూపర్వైజర్లు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను పక్కదారి పట్టిస్తున్న వైసిపి

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

వైసిపి నాయకులు తప్పుడు విమర్శలు, నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని సంజీవపురం గ్రామంలో అరటి పంట సాగు రైతులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోనే 56 శాతం అరటి ఉత్పత్తి శింగనమల నియోజకవర్గం నుంచే వస్తుందన్నారు. అలాంటి అరటి రైతుల ఇబ్బందులతో వైసిపి చేస్తున్న రాజకీయ డ్రామాలను ఆపాలని సూచించారు. కొన్ని రోజుల క్రితం అరటి ధర రూ.1000, 2000 ఉన్నమాట నిజమేనని, అయితే ప్రస్తుతం రూ.9000కు చేరుకుందన్నారు. వైసిపి నాయకులు అరటి రైతులను రాజకీయాలకు వాడుకోవడం మానేయాలని హితవు పలికారు. జగన్ రెడ్డి పాలనలో రైతుల పంటల ప్రభుత్వ నిర్లక్ష్యం, బకాయిలు, మధ్యంతర ధరలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు.

అరటి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మహాసభలను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-గుత్తి

ఈనెల 31 వ తేదీ నుంచి వచ్చే ఏడాది 1, 2, 3, 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలను జయప్రదం చేద్దామని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సి.రమేష్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లు, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ దినసరి కూలీలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు పార్వతి, రత్న, గంగా, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

పింఛన్లతో పేదలకు భరోసా

ప్రజాశక్తి-పుట్లూరు

ఎన్‌టిఆర్ పింఛన్ల పంపిణీతో పేదల జీవితాల్లో భరోసా కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. సోమవారం మండలంలోని కడవకల్లు గ్రామం ఎస్సీ, బీసీ కాలనీల్లో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పింఛన్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పింఛన్లను పెంచి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు గతంలో ఉన్న రూ.5 వేలను రూ.పదివేలకు పెంచామన్నారు. గతంలో వైసిపి ప్రభుత్వం రూ.వెయ్యిని ఐదేళ్లలో పెంచారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకేసారి పెంచిన మొత్తాన్ని పెంచి పంపిణీ చేసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కిందన్నారు.

డ్రెయినేజీ పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్‌తో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-తాడిపత్రి

తాడిపత్రిలో చేపట్టిన డ్రెయినేజీ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహం వద్ద రూ.18లక్షలతో చేపట్టిన డ్రెయినేజీ పనులను కమిషనర్ శివరామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక చొరవ తీసుకుని డ్రెయినేజీ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్ హరినాథ్‌రెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, టీడీపీ కౌన్సిలర్లు, జెసి అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని 38, 27వ డివిజన్లలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. నగరంలోని 38వ డివిజన్‌లోని విద్యారణ్య పాఠశాల వద్ద రూ.39 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. 27వ డివిజన్ అశోక్‌నగర్‌లో చాలాఏళ్లుగా పెండింగ్ ఉన్న బీటీ రోడ్డు పూర్తి చేయగా, రూ.70 లక్షలతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, మాంసాభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాష్‌నాయుడు, వీరశైవ లింగాయత కార్పొరేషన్ ఛైర్మన్ తుల్జాపూర్ స్వప్న, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల ల్యాబ్ టెక్నీషియన్‌కు అవార్డు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో పని చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ రవీంద్ర ఉత్తమ అవార్డు అందుకున్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అత్యధికంగా రక్త పరీక్షలు నిర్వహించినందుకు సోమవారం అనంతపురంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి ఇబి దేవి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు యమియా భూషణ్, సిహెచ్ఓ బాలాజీ, సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు రవీంద్రకు అభినందనలు తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రాప్తాడు

అనంతపురం క్యాంపు కార్యాలయంలో పలువురు బాధితులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం పంపిణీ చేశారు. అనంతపురము రూరల్ మండలం కక్కలపల్లి కాలనీకి చెందిన లక్ష్మీవరప్రసాద్, కృష్ణమరెడ్డిపల్లికి చెందిన కుంచపు వినోద్‌కుమార్, ఆత్మకూరు మండలం వడ్డిపల్లికి చెందిన పూల నరసమ్మ, ఆత్మకూరుకు చెందిన మిట్ట పద్మావతి, రాప్తాడు మండలం పెసరకుంటకు చెందిన దేవరకొండ యమున, ఎం.బండమీదపల్లికి చెందిన తమ్మినేని రంగయ్య, పెసరకుంటకు చెందిన సాకే సోమశేఖర్, ఎం.చెర్లోపల్లికి చెందిన గంధం నరేష్‌బాబు, రాప్తాడుకు చెందిన పామల్ల తనీష్, ఎన్.లత, కనగానపల్లి మండలం భానుకోటకు చెందిన బాల లక్ష్మీదేవి, కొండపల్లికి చెందిన గొల్ల గోవిందమ్మ, కనగానపల్లికి చెందిన సాకే పక్కీరమ్మ, చెన్నేకొత్తపల్లికి చెందిన పెనుకొండ హరి, రామగిరి మండలం ఎంసి.పల్లి కి చెందిన ఎరుకల సుబ్బరాయుడు, వెంకటాపురానికి చెందిన వి.గోవిందమ్మకు చెక్కులను అందజేశారు.

యాడికి సిఐగా ఆర్.శ్రీనివాసులు

ప్రజాశక్తి-యాడికి

యాడికి అప్ గ్రేడ్ పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా ఆర్.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో పాటు పలువురు సిఐకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటానని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

జెఎన్‌టియు విసికి అభినందనలు

ప్రజాశక్తి-అనంతపురం

ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా జాతీయ అవార్డును అందుకున్న అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఉపకులపతి హెచ్.సుదర్శనరావుకు పలువురు అభినందనలు తెలిపారు. ఈమేరకు సోమవారం పలువురు బొకేలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ మృతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ (54) సోమవారం తెల్లవారుజామున కన్నుమూశారు. గతకొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. నగరంలోని దివ్యశ్రీ ఆసుపత్రిలో గడిచిన వారం రోజులుగా చికిత్సపొందుతున్నారు. సోమవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించి కన్నుమూశారు. 30 సంవత్సరాలకుపైగా ఆయన జర్నలిజం వృత్తిలో ఉంటూ వార్త, సూర్య తదితర దినపత్రికల్లో పనిచేశారు. భార్య రాజేశ్వరీ, కుమార్తె జాహ్నవి ఉన్నారు. జాహ్నవి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. కాలవ రమణ మరణం పట్ల జర్నలిస్టులు సంతాపం తెలియజేశారు. సాయంత్రం ఆయన అంత్యక్రియలు హిందూపురం పట్టణంలో ముగిశాయి. కాలవ రమణ మృతికి అనేక మంది రాజకీయనాయకులు సంతాపం తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ఒక ప్రకటనలో తెలిపారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రమణ కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తామని ప్రకటించారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డితో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.